బాలల హక్కులు కాపాడుకుందాం..

• డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం ఫోర్ట్: బాలలకు భద్రత కల్పించి వారి హక్కులను కాపాడుకుందామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. శనివారం స్థానిక కోలగట్ల నివాసంలో చైల్డ్‌రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్ ప్రతినిధులు రూపొందించిన వాల్ పోస్టర్లను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. బాలల హక్కులకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి

ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం బాలల విద్య, వైద్యం కోసం అనేక కార్యక్రమాలను చేపడుతోందన్నారు. నాడు - నేడు ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు కంటే మిన్నగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చిందని తెలిపారు. డిజిటల్ తరగతులు, ఇంటర్నెట్ సదుపాయాలు, ట్యాబ్‌లను విద్యార్థులకు సమకూర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, విజయనగరం కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్, కార్పొరేటర్లు ధనలక్ష్మి, సత్యనారాయణ, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి యాళ్ల నాగరాజు, మిషన్ వాత్సల్య సిబ్బంది చప్ప అరుణ్‌కుమార్, పి. గౌరీ, ఝాన్సీ రాణి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమం..

• వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి

భోగాపురం: సంక్షేమం, అభివృద్ధి కావాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. భోగాపురం పంచాయతీ అప్పన్నపేటలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి గత టీడీపీ ప్రభుత్వం మేనిఫెస్టో అమలు చేయకుండా ప్రజలను ఎలా మోసం చేసినదీ వివరించడంతో పాటు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని వివరించారు. అనంతరం ప్రజల అభీష్టం మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగుర వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కో ఆప్షన్ సభ్యుడు మదీనఫేక్ సాహెబ్, పడాల శ్రీనివాసరావు, అప్పురభుక్త పైడినాయుడు, కొమ్మూరు సుభోషణరావు, సుందరహరీష్, కొయ్య బంగార్రాజు, పోతిరెండి గోపి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


భోగాపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి కందుల రఘుబాబు, మండల కన్వీనర్ ఉప్పాడ, నాయకులు

పేదల ఆశాజ్యోతి సీఎం జగన్


బాధిత కుటుంబ సభ్యుడికి రూ.5 లక్షల బీమా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

• ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
• బాధిత కుటుంబానికి రూ.5 లక్షల బీమా సొమ్ము పంపిణీ

నెల్లిమర్ల రూరల్: ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పూతికపేటలో ఇటీవల గ్యాస్ సిలిండర్ లీకై మృతి చెందిన మహంతి పాపయ్యమ్మ కుటుంబానికి రూ.5 లక్షల వైఎస్సార్ బీమా చెక్కును శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ... కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడంలో సీఎం జగనన్న ముందు వరుసలో ఉంటారన్నారు. వైఎస్సార్ బీమా కింద గడిచిన నాలుగేళ్లలో నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగు మండలాల్లో మొత్తం 804 మంది బాధిత కుటుంబాలకు రూ.13.08 కోట్లు అందజేశామన్నారు. వైఎస్సార్ బీమా సొమ్మే కాకుండా అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుల వివరాలను సీఎంకు వివరించగానే సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ, సర్పంచ్ పతివాడ అప్పన్న, నాయకులు కర్రోతు వెంకటరమణ, వాల్లె అప్పలనాయుడు, గోవింద, తదితరులు పాల్గొన్నారు.

దీపావళి వెలుగులు నింపాలి..

విజయనగరం ఫోర్ట్: దీపావళి పండగ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని డీసీఎంఎస్ చైరపర్సన్ డాక్టర్ అవనాపు భావన, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ అవనాపు విక్రమ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ పండగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

క్లుప్తంగా

ఎక్కువ పొగ వచ్చే మందుగుండు కాల్చవద్దు

• రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి సత్యం


సైకిల్‌ర్యాలీ చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

విజయనగరం ఫోర్ట్: దీపావళి రోజున ఎక్కువ పొగ వచ్చే మందుగుండును కాల్చవద్దని రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి పి.సత్యం అన్నారు. శనివారం స్థానిక కోట జంక్షన్ వద్ద రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్వచ్ఛ దివాళీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణానికి హాని కలగకుండా దీపావళి జరుపుకోవాలని సూచించారు. ప్రమాదకర పొగ పీల్చడం వల్ల ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో గౌరీశంకర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

16న కల్యాణ్‌రామ్‌కు పత్రికా దినోత్సవం పురస్కారం


కల్యాణ్‌రామ్

విజయనగరం: ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం విజయనగరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16న గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయలో జాతీయ పత్రికా దినోత్సవం నిర్వహించనున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అనకాపల్లికి చెందిన సీనియర్ పాత్రికేయుడు కాంద్రేగుల కల్యాణ్‌రామ్‌కు జాతీయ పత్రికా దినోత్సవ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. 1964 డిసెంబర్ 22న జన్మించిన కల్యాణ్‌రామ్ 40 ఏళ్లుగా పాత్రికేయుడిగా, సంపాదకుడిగా సేవలందిస్తున్నారని తెలిపారు.

పరామర్శ..


మాజీ సర్పంచ్ రాజబాబును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని గరికిపేట, టెక్కలి, కొండగుంపాం గ్రామాల్లో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శనివారం పర్యటించారు. మాజీ సర్పంచ్ గుంటమాని రాజబాబు సతీమణి సింహాచలం ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో గరికిపేటలో రాజబాబును పరామర్శించి ఓదార్చారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నేతలు పతివాడ రాజారావు, రాజినాయుడు ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు చనమళ్ల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, టూరిజం బోర్డు డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పతివాడ సత్యనారాయణ ఉన్నారు.

చిన్న శ్రీను సోల్జర్స్ ఆసరా..


చిన్న శ్రీను సోల్జర్స్ ఆధ్వర్యంలో సమకూర్చిన టిఫిన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మజ్జి సిరిసహస్ర

విజయనగరం: కష్టాల్లో ఉన్న నిరుపేద కుటుంబానికి ఆసరాగి నిలిచింది చిన్న శ్రీను సోల్జర్స్ బృందం. నగరంలోని లంకాపట్నానికి చెందిన నిమ్మల గోవింద, కామేశ్వరి దంపతులు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరి సహస్ర శనివారం వారికి ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టారు. ఆర్థిక సాయం కోసం వేచిచూస్తున్న గోవింద దంపతులకు టిఫిన్ వ్యాపారం చేసుకునేందుకు అవసరమైన సామాగ్రితో పాటు తోపుడుబండిని సమకూర్చారు. చిన్న శ్రీను సోల్జర్స్ చేసిన పెద్ద సహాయాన్ని తామెన్నటికీ మర్చిపోలేమని గోవింద దంపతులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోటవాను, కార్యదర్శి జాకీర్ హుస్సేన్, రామకృష్ణ, శ్రీనివాస్, అప్పలనాయుడు, శివ, అభిరామ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పైడితల్లి మెట్ల పూజ

విజయనగరం టౌన్: నగరంలోని మూడులాంతర్ల వద్దనున్న పైడితల్లి చదురుగుడి ఆవరణలో శనివారం రాత్రి నిర్వహించిన మెట్ల పూజ ఆద్యంతం భక్తిభావాన్ని సంతరించుకుంది. వందలాది మంది దీక్షాపరుల నడుమ ఒక్కో మెట్టుకు పూజలు చేశారు. పైడిమాంబ దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో సారథ్యంలో అచ్చిరెడ్డి , మహేష్, రంజిత్ టీమ్ నిర్వహించిన కార్యక్రమంలో దీక్షాపరులు పూజాకార్యక్రమాలను ఘనంగా చేపట్టారు. ఆలయ ఈఓ సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

15న చలో విజయవాడ


ప్రచారంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: ఈనెల 15న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ తెలిపారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణ భేరిబస్సు యాత్రపై శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బస్సుయాత్ర ముగింపు సందర్భంగా విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎ. జగన్ మోహనరావు, చిన్నారి, రాము, రామకృష్ణ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నెల్లిమర్ల: ఈనెల 15న సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎ. జగన్‌మోహనరావు పిలుపునిచ్చారు. స్థానిక రామతీర్థం జంక్షన్‌లో ఆయన మాట్లాడుతూ, విజయవాడలో లక్షలాది మందితో జరిగే బహిరంగ సభలో ప్రజలంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బాబూరావు, దుర్గారావు, శ్రీను, హరి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

26న కార్తీక దీపోత్సవం


దీపాలంకరణలో రామనారాయణం

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో ఈ నెల 26న కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు 1116 మంది మహిళా భక్తులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రేపటి నుంచి అన్న ప్రసాద వితరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కంది మురళీనాయుడు, తదితరులు

విజయనగరం టౌన్: జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వివిధ రకాల దీక్షాపరులందరికీ సోమవారం నుంచి అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపడుతున్నట్లు ప్రముఖ వ్యాపారవేత్త కంది మురళీనాయుడు తెలిపారు. శనివారం స్థానిక పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో శనివారం ఆయన మాట్లాడుతూ, 41 రోజుల పాటు ప్రసాద వితరణ చేపడతామన్నారు. 11 సంవత్సరాలుగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెంటపాటి కామరాజు, రమేష్, కె.నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఖండన

యిందుమూలముగా యావన్మందికి ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, నాక్లయింటయిన విజయనగరం జిల్లా, మరియు మండలం, చెల్లూరు గ్రామం కాపురస్తులు అయిన కోరాడ జగ్గయ్య కుమారుడు కోరాడ ఆదినారాయణ మరియు ఇతర కుటుంబసభ్యులు కలిపి తే 08-11-2023దిన సాక్షి దిన పత్రికలో జె.భాస్కరప్రసాద్, అడ్వకేట్, హైకోర్టు ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి క్లయింటు అయిన విజయనగరం జిల్లా, మరియు మండలం, చెల్లూరు గ్రామం కాపురస్తుడు కోరాడ జగ్గయ్య కుమారుడు కోరాడ పైడిరాజు యిచ్చిన పత్రికా ప్రకటనకు ఈ ఖండన ఇవ్వదమైనది.

నా క్లయింటయిన కోరాడ ఆదినారాయణ మరియు ఇతరులపై సదరు జె.భాస్కర్ ప్రసాద్ గారి క్లయింటు అయిన కోరాడ పైడిరాజు గారు O.S.No.11/2023 I.A.No.119/2023 అను పార్టిషన్ దావా సదరు పత్రికా ప్రకటనలలో ఇచ్చిన స్థిరాస్తులపై దావా దాఖలు చేసియున్నాడు. సదరు విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి కోర్టువారు, ఎటువంటి సదరు నిషేధ ఆజ్ఞలు రెవిన్యూ మరియు జాయింటు రిజిస్ట్రార్లపై ఇచ్చియుండలేదు. అటులనే సదరు దావా మరియు పిటీషను కోర్టులో వేసినంత మాత్రాన సదరు పైడిరాజుకు ఎటువంటి హక్కులుగాని, వాటాగాని సిద్ధించవని ఈ పత్రికా ఖండన ద్వారా యావన్మందికి తెలియజేయడమైనది. అటులనే సదరు పత్రికా ప్రకటనలో తెలిపిన ఆస్తులపై అమ్మకాలుగాని, కొనుగోళ్లుగాని, మరి ఏ ఇతర లావాదేవీలు జరిపినచో చట్టపరమైన చర్యలు తీసుకొనుటకు సదరు కోరాడ పైడిరాజుకు ఎటువంటి హక్కులేదని, తీసుకొనే యెడల సదరు కోరాడ పైడిరాజే నష్టపోవుదురని, ఈఖండన ద్వారా తెలియజేయడమైనది. పై తెలిపిన ఆస్తులపై 2007సం.లో అల్లి స్వాతి అను అసామి కోరాడ పైడినాయుడు వగైరాలపై O.S.No.721/2007 అను పంపకం దావా విజయనగరం Prinicipal Junior Civil Judge వారి కోర్టులో వేసి సదరు దావాలో వాదోపవాదాలు విన్న తరువాత, సదరు అల్లి స్వాతి వేసిన దావా శ్రీ కోర్టువారు కొట్టివేసినారు. అటులనే విజయనగరం జిల్లా కోర్టులో వేసిన అప్పీల్ కూడా కొట్టివేసినారు. సదరు కోరాడ పైడిరాజుకు జగ్గయ్య గారి ఆస్తిలో ఎటువంటి హక్కులేదని, యావన్మంది ప్రజానీకానికి ఈ ఖండన ద్వారా తెలియజేయడమైనది.

సదరు తప్పుడు పత్రికా ప్రకటన సదరు కోరాడ పైడిరాజు ఇచ్చినందున, నా క్లయింటు చట్టపరమైన సివిల్, మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనుటకు ఉపక్రమించుచున్నారని ఈ ఖండన ద్వారా తెలియజేయడమైనది.

స్థలం : విజయనగరం
తేది : 11-11-2023

ఇట్లు..
అదుర్తి వాసుదేవ్, అడ్వకేటు
సెల్ నెం. 9440193734

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి


మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న పోలీస్ అధికారులు

విజయనగరం క్రైమ్: మైనారిటీస్ వెల్ఫేర్ డేను పురస్కరించుకుని ఎస్పీ దీపిక, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఈ .నరసింహమూర్తి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐ నరసింహమూర్తి మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధుడిగా , భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖా మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎనలేని సేవలు అందించారన్నారు. జాతీయాభివృద్ధికి, విద్యారంగ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన మహానుభావుడని కొనియాడారు. అటువంటి మహనీయుడి జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా, మైనార్టీ వెల్ఫేర్ డేగా నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు రమణమూర్తి, ఎన్.గోపాలనాయుడు, డీసీఆర్‌బీ ఎస్సై వాసుదేవ్, ఆర్ఎస్సైలు నారాయణరావు, రామకృష్ణ, నీలిమ, ప్రసాదరావు, కేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా కమిటీ సభ్యులు ఉపాధ్యాయుల సమస్యలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు సంఘ ప్రతినిధులు శనివారం ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయ, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ప్రతి ఉన్నత పాఠశాలకు కేటాయించాలని కోరారు. ప్రతి నియోజకవర్గ ఎమ్మెల్యేకి వినతిపత్రాలు ఇవ్వాలనే రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టామని సంఘ సభ్యులు తెలిపారు. డిప్యూటీ స్పీకర్‌ని కలిసిన వారిలో సంఘ అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వీవీజే సుబ్రహ్మణ్యం, సీనియర్లు ఈ.రామునాయుడు, ఏజీ తాతారావు, కె.భాస్కరరావు, ఎ.కిరణ్‌కుమార్, రాము, అప్పారావు ఉన్నారు.


వినతిపత్రం అందుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ఒకరి అరెస్ట్

విజయనగరం క్రైమ్: మద్యంతో ఓ మహిళ పట్టుబడినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ బి. మధుకుమార్ తెలిపారు. కార్పొరేషన్ పరిధిలో సీఎంఆర్ జంక్షన్ వద్ద శనివారం తనిఖీలు చేపడుతుండగా 9 మద్యం సీసాలతో మహిళ పట్టుబడిందన్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. దాడుల్లో ఎస్సై జాన్‌ప్రసాద్, హెచ్‌సీ బాషా, కానిస్టేబుళ్లు రవి, సౌధాన్య, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు


భక్తిగీతాలాపన చేస్తున్న షేక్ గౌస్ బాషా బృందం

విజయనగరం టౌన్: పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా స్థానిక చదురుగుడి, వనంగుడి ఆవరణలలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతం ఆహూతులను భక్తిపారవశ్యంలో ముంచెత్తుతున్నాయి. రైల్వేస్టేషన్ వద్ద విజయనగరానికి చెందిన షేక్ గౌస్ బాషా ఆలపించిన భక్తి గీతాలు అలరించాయి. చదురుగుడి వద్ద డాక్టర్ భేరి రాధికారాణి శిష్యబృందం నృత్యార్చన ఆకట్టుకుంది. వాసవీక్లబ్ దొండపూడి కోలాట ప్రదర్శన అబ్బురపరిచింది. కళాకారులను నిర్వాహకులు సత్కరించారు.

కరాటే పోటీల్లో చీపురుపల్లి విద్యార్థుల సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న శ్రీనివాసనాయుడు

చీపురుపల్లి: స్థానిక శేఖర్ కరాటే అకాడమీలో శిక్షణ పొందుతున్న పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కరాటే పోటీల్లో సత్తా చాటారు. ఈనెల 9, 10, 11వ తేదీల్లో రాష్ట్రస్థాయి అండర్-17, 19 విభాగంలో బాలురు, బాలికలకు పార్వతీపురంలో కరాటే పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో పట్టణానికి చెందిన రామచైతన్య ద్వితీయ స్థానం, పి.బాలాదిత్య తృతీయ స్థానంలో నిలిచారు. వీరిని చీపురుపల్లిలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు శనివారం అభినందించారు. క్రీడల్లో రాణించే విద్యార్థులకు తమ వంతు సహకారం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. రేవల్ల సత్తిబాబు, ట్రైనర్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మౌలికవసతుల కల్పనకు ప్రాధాన్యం


సీసీ రోడ్డు, వీధి కాలువలను ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ శిరీష

చీపురుపల్లి: పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధి పాతకుమ్మరివీధిలో రూ.9 లక్షల ఎంపీపీ, జెడ్పీటీసీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, వీధి కాలువలను మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణితో కలిసి శనివారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ, తాగునీరు, రహదారులు, కాలువలు వంటి అవసరాలకు తక్షణమే నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, ప్రభాత్, దాలయ్య, కొసిరెడ్డి రమణ, మహంతి ఉమ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మెరకముడిదాం: మండలంలోని బిళ్లలవలస ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల ఎస్.కోటలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-17 బాస్కెట్ బాల్ పోటీల్లో విద్యార్థిని బూర లావణ్య రాణించడంతో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. అలాగే ఈనెల 7వ తేదీన నెల్లిమర్ల మండలం అలుగోలు ఉన్నతపాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో కన్నూరి పావని సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా జట్ల తరఫున వీరు ప్రాతినిధ్యం వహించనున్నారు. విద్యార్థినులను హెచ్ఎం బి.సత్యనారాయణ, పీడీ వెంకటరమణ గ్రామపెద్ద టి.వర్మరాజు శనివారం అభినందించారు.